# సంకెళ్ళు తెగుతున్న సంగీతం

స్త్రీ వాద సాహిత్యాన్ని అశ్లీల సాహిత్యంగా, స్త్రీలు రాస్తున్న కవితలను నీలి కవితలుగా విమర్శలు చేసే వారిని చూస్తుంటే, దిగువన ఎక్కడో నీళ్ళు తాగుతున్న మేకపిల్లపై నా నీళ్లు ఎంగిలి చేస్తున్నావని దాడి చేసిన తోడేలు గుర్తొస్తుంది. ఆ తోడేలుకి ఎగువ, దిగువ, ప్రవాహం ఎటునుంచి వుందీ – ఇవన్నీ అనవసరం. ఒక రీజన్నీ, భౌతిక వాస్తవికతనీ పట్టించుకోదు. దానికి ఏదో ఒక నెపం కావాలి. ఎంగిలి అనే నెపం పెట్టింది. ఇక్కడ ఈ విమర్శకులకు అంతకంటే చౌకబారు నెపాలు దొరికినాయి. 'అశ్లీలం', 'వ్యభిచారం', 'నీలి', 'వైయక్తిక సమస్యలు', 'సామాజిక బాధ్యతను విస్మరించే పెడధోరణి', 'శీలం లేని వాళ్లు' ఇత్యాది ఆరోపణలతో దాడికి దిగారు. ఈ దాడికి భయపడి నీరసపడి స్త్రీలు కవిత్వం రాయడానికి ఏ కొంచెం సంకోచించినా వీళ్ళ ఎత్తుగడ ఫలిస్తుంది. ఐతే ఈ ఎత్తుగడ కొత్తది కాదు. స్త్రీలు చేస్తున్న పనుల మీద బురద చల్లాలంటే ప్రతివాళ్లూ మొదట పైకి తీసే ఆయుధాలు అవే. అవి పనిచెయ్యడం లేదనుకుంటే ఇంకా హీనంగా వ్యక్తి గత నిందలకూ, వాళ్లు మంచివాళ్లు కాదనే ప్రచారాలకూ దిగుతారు. ఇవాళ కొందరు విమర్శకులకు స్త్రీ వాద రచయిత్రులు 'ఒళ్ళు బలిసిన ఆడవాళ్ళు'గా కనపడేంత హీనస్థితిలో వుంది తెలుగు సాహిత్య విమర్శ. (చెప్పుదెబ్బలు తింటామేమో ననే భయం లేకుండా ఈ రకమైన మాటలు రాస్తున్నారంటే స్త్రీ వాదులు ఎంత క్షమా హృదయులో తెలుస్తుంది). ఈ రకమైన విమర్శనలు చూస్తే ఎంత చికాకు కలుగుతుందో వీటికి సమాధానం చెప్పడం కూడా అంతకన్నా చికాకైన పని. ఎందుకంటే ఈ విమర్శలకు ఎలాంటి సిద్ధాంత పునాదీ లేదు. లేకపోవడం వల్లనే అలాంటి చెత్త రాయగలుగుతున్నారు.

గత పది సంవత్సరాలుగా స్త్రీ వాదం కొన్ని విషయాలను ముందుకు తెచ్చి చర్చకు పెట్టింది. పితృస్వామ్యం, జండర్, అణచివేత, ఇంటి చాకిరీ స్వభావం మొదలైన ఎన్నో విషయాల గురించి కొత్త ఆలోచనలు రేపింది. సమాజంలో స్త్రీ పురుషులు ఎలా నిర్వచింపబడతారనే దాని మీద ఆధారపడి సమాజంలో రక రకాల విషయాలు రూపొందుతాయనీ, మిగిలిన విషయాలన్నిటికీ నిర్దిష్టమైన స్వరూప స్వభావాల నిచ్చేంత ప్రధానమైన విధానం జండర్ విధానమనీ స్త్రీ వాదం చెబుతోంది. వాటిని గురించి ఆలోచించకుండా, చర్చించకుండా, ఆ

కొత్త ఆలోచనలు సాహిత్య రూపాలుగా బైటికి వచ్చినప్పుడు వాటిని పైపైన చూసి స్త్రీ వాదులు లైంగిక విషయాల గురించీ, శరీరాల గురించీ మాత్రమే మాట్లడతారని విమర్శకు దిగుతారు. మార్క్సిస్టులతో సహా అందరూ స్త్రీ వాదం అనగానే తమకు తోచినదేదో అనుకుని, తమ ఊహాపోహల మీద ఆధారపడి విమర్శలు సృష్టిస్తుంటారు. పాత పడికట్టు పదాలతో దాడికి దిగుతారు. అందువల్ల ఈ వివాదాలకు ఎప్పటికీ ఒక సిద్ధాంత పునాది వుండదు. ఒక సిద్ధాంత రూపాన్ని పొందలేవు. అందువల్లే స్త్రీ వాదాన్ని అధ్యయనం చేసే వాళ్ళకు ఈ చవకబారు విమర్శల్ని చూస్తే చిరాకు వేస్తుంది.

ఆ చిరాకు అణుచుకుని వీళ్లు నీలి కవితలంటూ గగ్గోలు పెడతున్న కవితలనూ, ఆ కవితలకున్న స్త్రీ వాద దృక్పథాన్నీ, అవసరమైన మేరకు స్త్రీ వాద దృక్పథాన్నీ వివరించడానికి ప్రయత్నిస్తాను. ఇలాంటి దాడికి గురవుతున్న స్త్రీ వాద కవితల్లో "హృదయానికి బహువచనం" "లేబర్ రూం" "జుగల్ బందీ" "తెల్లారకట్ట కివతల" "కాల్ గర్ల్స్ మోనోలాగ్" "పైటని తగలెయ్యాలి" "అబార్షన్ స్టేట్‌మెంట్" మొదలైన కవితలున్నాయి. మళ్లీ కొన్ని గ్రూపులకు కొన్ని కవితలపట్ల పెద్ద అభ్యంతరాలు లేవు. కొన్ని కవితల పట్ల చాలా కోపం వుంది. ఈ కవితల్లో కొన్ని పదాల పట్ల కూడా తీవ్రమైన అభ్యంతరాలున్నాయి. కొందరు స్త్రీ విమర్శకులు కూడా ఈ పదాల పట్ల అభ్యంతరాలు చెబుతున్నారు. 'రతిరోత' 'వీర్య వర్షం' 'జననాంగం' 'స్వప్న స్ఖలనం' మొదలైన పదాలు. ఈ పదాలన్నీ ప్రబంధ కవుల దగ్గర్నుంచీ అభ్యుదయ, విప్లవ కవిత్వాల్లో కవులందరూ వాడినవే. ఐనా కవయిత్రులు వాడేసరికి అభ్యంతరాలు వచ్చేస్తున్నాయి. సందర్భానికి తగినవైనా సరే స్త్రీలు కొన్ని పదాలు వాడితే బాగోదు. అమర్యాద. పురుషులు వాడినా పర్వాలేని పదాలు స్త్రీలు వాడకూడదంటూనే స్త్రీ పురుషులు సమానులుగానే వున్నారంటారు వీళ్లల్లో కొందరు. నిజానికి స్త్రీల మీద ఇదో రకం సెన్సారు. స్త్రీల భావోద్వేగాన్నీ, భాషనూ కంట్రోలు చేసే విధానం. ఈ విమర్శ చేస్తున్న వారికి కూడా తాము సెన్సారు కత్తెరతో కంట్రోలు చేయ్యడానికి కూర్చున్నామని తెలియదు. అంతగా ఇంటర్నలైజ్ అయిపోయిన సెన్సారది. స్త్రీలు మన్నితంగా లలితమైన పదాలతో, మర్యాదా రేఖలనతిక్రమించకుండా రాయాలనడం జెండర్ విధానంలో ఒక భాగం మాత్రమే.

స్త్రీ వాద కవితలను స్త్రీల స్వంత సమస్యలుగా, స్వంత అసౌకర్యాల అనుభూతుల గొడవలుగా కాకుండా, సామాజిక సమస్యలుగా గుర్తించాలి. స్త్రీ వాదం లైంగికత్వాన్నీ సంతానోత్పత్తినీ సామాజిక పునాదిలో భాగంగా చూస్తుంది. స్త్రీల లైంగికత్వం మీదా, సంతానోత్పత్తి మీదా ఎలాంటి ఆంక్షలూ నిర్బంధాలూ వున్నాయనే దాన్ని బట్టే సమాజంలో స్త్రీల స్థానం, హోదా ఆధారపడి వుంటాయని చెబుతుంది. లైంగికత్వం పిల్లల్ని కనడం లాంటివి అచ్చం స్త్రీల సమస్యలే అనుకోకుండా సామాజిక సమస్యలుగా పట్టించుకున్నప్పుడే సమాజంలోనూ, స్త్రీల స్థానం లోనూ మార్పొస్తుంది. అందువల్ల స్త్రీ వాద కవితలు స్త్రీల స్వంత అసౌకర్యాల గొడవలనుకుంటే పొరబాటు.

పితృస్వామ్య సమాజంలో జండర్ విధానం స్త్రీల శరీరాలను అదుపులో వుంచటానికి భావజాల చట్రాన్ని పకడ్బందీగా రూపొందించింది. ఆ భావజాలం స్త్రీలకు తమ మీదా, తమ శరీరాల మీదా, ద్వేషం అసహ్యం కలిగేలా చేస్తుంది. శరీర అవయవాల పట్లా అవిపొందే అనుభవాల పట్లా, వాటి విధుల పట్లా ఒక వైపు ఛేదించలేనంత బలమైన మిత్‌నీ, ఇంకొకవైపు అంతులేని అసహ్యాన్నీ కలుగజేస్తుంది. రుతుధర్మాన్ని గురించి రాయటమేంటి. అదొక అసౌకర్యంగా భావించటమేంటి. అది ప్రకృతి ధర్మం, శారీరక విధి, దానిని ఒద్దనుకోవటమేమిటని విమర్శకులు ఆవేశపడి పోతున్నారు. ఐతే సమాజం దానిని ప్రకృతి ధర్మంగా చూస్తోందా? చూస్తుంటే లక్షలాది స్త్రీలు ఆ రోజుల్లో ఏదో పాపం చేసినట్లు వెలిగా ఉండటమెందుకు? అసలు సాంఘిక నియమాల అదుపుకు గురికాని సహజమైన-శారీరకమైన విషయమంటూ ఉండదు. ఆ అదుపు భరించలేని అణిచివేతగా మారే చారిత్రక సందర్భాలెన్నో వుంటాయి. రుతుధర్మం ఆడపిల్లల జీవితాల్లో ఎంత కల్లోలాన్ని రేపుతుందో అర్థమైన వాళ్ళకు, దాని చుట్టూ వున్న భావజాలాన్ని బద్దలు కొట్టాలనిపిస్తుంది. ఆడపిల్లల మీద రుతుక్రమం మొదలవకముందు వుండే కంట్రోలుకూ, రుతుక్రమం మొదలైన తర్వాత వుండే కంట్రోలుకూ స్వరూపంలో స్వభావంలో ఎంతో తేడా వుంటుంది. అది భరించి, దాని కలవాటు పడటానికి ఆడపిల్లలు తమతోనూ, సమాజంతోనూ ఎంతో యుద్ధం చెయ్యాలి. ఆ యుద్ధాన్ని గురించి ఏమీ మాట్లాడకుండా యింతకాలం ఆపగలిగారు. ఇవాళ ఆ రుతుధర్మాన్ని గురించి మాట్లాడుతుంటే కోపంతో మండిపడుతున్నారు. బహిష్టు గురించి ముందు భయం, తర్వాత అది అపవిత్ర విషయమనీ దాన్ని

ఎవరికీ తెలియకుండా దాయాలనే తపన, సైన్సు సహాయంతో దాన్ని కంట్రోలు చేసి మత విధులు నిర్వహించటానికి పడే తాపత్రయం, దాని వల్ల ఆడవాళ్ళ శరీరంలో జరిగే మార్పులు, ఋతుధర్మం గురించి ఆడవాళ్ళ శరీరాల మీద జరిగే ప్రయోగాలు, ఆపరేషన్లు, స్త్రీని గర్భసంచీ మోసే యంత్రంగా పరిగణించే వైద్య వ్యవస్థ. యివన్నీ స్త్రీల ఋతు ధర్మాన్ని కంట్రోలు చేస్తున్నాయి. అదెంత మాత్రమూ ప్రకృతి ధర్మంగా మిగిలి లేదు. స్త్రీల శరీరాన్నీ శరీర విధులనీ కంట్రోలులో పెట్టడం ద్వారా వాళ్ళను మానసికంగా కూడా అదుపులో వుంచుతుందీ సమాజం. స్త్రీలను అదుపులో వుంచితే మొత్తం సామాజిక జీవిత విధానాన్నే అదుపు చెయ్యవచ్చని నమ్ముతుందీ పితృస్వామ్యం. అందువల్ల కొత్త కొత్త పద్ధతుల్లో నిరంతరం ఆ అదుపుకోసం ప్రయత్నిస్తుంటుంది. స్త్రీలు ఈ సమాజంలో లైంగిక అనుభూతులనేవి లేనట్లు నటించాలి. పురుషులు మాత్రం వాళ్ళను లైంగిక సుఖాన్నిచ్చే వస్తువులుగా చూస్తుంటారు. తాము పురుషుల దృష్టిలో లైంగిక సుఖాన్నిచ్చే వస్తువులై, తమ కసలు ఆ అనుభూతులనేవి లేనట్లు నటించాల్సిన స్థితీ, అట్లా నటించే వరకూ తముపై నిరంతరం జరిగే 'పోలీసింగ్' యివన్నీ వాళ్ళను అయోమయానికి గురి చేస్తాయి. ఈ నటన వాళ్లను కుంగదీస్తుంటుంది. వాళ్ళ శరీరాలలో జరిగే మార్పులు అర్థం చేసుకునే అవకాశం వుండదు. తమ శరీరాలకు కలిగే అనుభూతులు 'పవిత్రమైనవా' 'అపవిత్రమైనవా?' అనే అయోమయంలో చిక్కుకుంటారు. మొత్తానికి తమ శరీరాలను ద్వేషించటమో, గందరగోళ పడటమో చేసి తమకు తామే పరాయి వాళ్ళవుతారు. అప్పుడు ఆ స్త్రీలను కంట్రోలు చెయ్యటం సమాజానికి సులభమవుతుంది. ఇదొక కుట్ర.

ఈ కుట్రను గుర్తించిన స్త్రీ వాదం, స్త్రీల గురించి ఈ సమాజపు నిర్వచనాలను తిరస్కరించాలనీ, స్త్రీలు తమను తాము కొత్తగా నిర్వచించుకోవాలనీ ప్రతిపాదిస్తుంది. అట్లా నిర్వచించుకునే ప్రయత్నాలలో భాగంగా వస్తున్న "హృదయానికి బహువచనం" 'జుగల్ బందీ' వంటి కవితా రూపాలను చూసి అవి సమాజంతో సంబంధంలేని స్వంత వ్యవహారాలనుకోవటం అవివేకం.

సంతానోత్పత్తి, లైంగికత్వం, ఇంటిచాకిరీ వీటి గురించి స్త్రీల దృక్పథం నుండి ఎంతో సాహిత్యం రావాల్సిన అవసరం వుంది. ఈవిషయాలు సామాజిక పునాదిలో భాగమని సమాజం గుర్తించేంత వరకూ ఈ సాహిత్యం రకరకాల

రూపాల్లో వస్తుంటుంది. పిల్లల్ని కనటం, పెంచటం, ఇంటి చాకిరీ చేసుకోవటం అనేవి స్త్రీల సొంత విషయాలు కావు. ఈ పెట్టుబడి దారి సమాజం స్త్రీలు చేస్తున్న పునరుత్పత్తి మీద ఎలా ఆధారపడి వుందో చూద్దాం. పెట్టుబడికి స్త్రీల శ్రమే ఆధారం. సంతానోత్పత్తి వల్ల శ్రామికవర్గం సృష్టించబడుతోంది. ఆ శ్రామికశక్తి పెట్టుబడికి అవసరం. శ్రామికశక్తి పెరిగే కొద్దీ వేతనాలు తక్కువగా వుంచే అవకాశం వుంటుంది. పెట్టుబడికి అవసరమైన శ్రామిక శక్తిని సృష్టించే 'సంతానోత్పత్తి శ్రమ'కు విలువ ఉండదు. వేతనాలను నిర్ణయించేటప్పుడు ఈ శ్రమను ఒక జీవితావసరంగా పరిగణించరు. స్త్రీలు చేస్తున్న సంతానోత్పత్తి శ్రమ విలువగానీ, ఇంటి చాకిరీ విలువ గానీ వేతనంలో కలవక పోవటం వల్ల వేతనం ఉండవలసిన స్థాయి కంటే తక్కువ స్థాయిలో వుంటుంది. దీని వల్ల అవసర శ్రమ కాలం తగ్గుతుంది. (కనీస జీవితావసరాల్ని సంపాదించుకోటానికి అవసరమైన శ్రమకాలాన్ని అవసర శ్రమకాలం అంటారు.) అదనపు శ్రమకాలం - అంటే పెట్టుబడి దారుడికి అదనపు విలువని సంపాదించి పెట్టే శ్రమ కాలం - పెరుగుతుంది. ఫలితంగా పెట్టుబడి మరింత వృద్ధి పొందుతుంది. అంటే పెట్టుబడి వృద్ధి పొందటానికి స్త్రీలు చేస్తున్న సంతానోత్పత్తికి, ఇంటి చాకిరీకి విలువలేక పోవటం, అవి ఎకానమీలో భాగం కాకపోవటం ఒక కారణమవుతోంది. ఈ విలువలేని చాకిరిని స్త్రీల మీద రుద్దటానికి ఆధారాలుగా కుటుంబవ్యవస్థ, అందులోని పురుషాధిపత్యం పని చేస్తుంటాయి. ఈ ఇంటి చాకిరినీ, సంతానోత్పత్తినీ పవిత్ర విధులుగా, మాతృత్వమనే పేరుతో అందమైన భావజాలపు మాయలో చూపించటం వల్ల వీటికి విలువ వుంది అనటం అపరాధమవుతోంది. సమాజం విలువ యివ్వని ఈ పనులు మేము చేయమని స్త్రీలు అంటుంటే అది ఈ పితృస్వామ్య సమాజంపై తిరుగుబాటుగా కాక విశృంఖలత్వంగా, వ్యక్తివాదంగా కనబడుతోంది. కానీ యిక స్త్రీలు ఈ విమర్శలకు ఏ మాత్రం విలువ యివ్వరు. సంతానోత్పత్తి గురించి, సంతానోత్పత్తిలో ముడిపడివున్న లైంగికత్వం గురించీ, దాని కాధారమైన శరీరం, శరీర ధర్మాల గురించీ, ఆలోచిస్తారు. మాట్లాడతారు.

'జుగల్ బందీ' కవిత ఒక స్త్రీ రాయటమే ఈ సమాజాని కొక పెద్ద సవాల్. లైంగిక అనుభూతులే లేనట్లు నటించాల్సి స్త్రీ వాటి గురించి రాయటమేమిటి? ఒక వేళ రాసినా పురుషుడి పురుషత్వానికి దాసోహమన్నట్లు రాయకుండా అతనితో సమాన స్థాయిలో వున్నట్లు రాయటమేమిటి? ఆ

తర్వాత అదంతా కలలా కరిగిపోయి అసలు నిజం అర్థం కావటం మరింత బాధాకరం. 'తెల్లారకట్ట కీవతల' కవితలో "ఎవరెవరి మొహాలతోనో, మోహాలతోనో నలికెల పాములమై పెనగుతున్నప్పుడు" అన్న వాక్యాలు ఈ పవిత్ర దాంపత్య వ్యవస్థ కొక సవాలు. ఈ సవాలును భరించలేక "సెక్సు గురించి రాయటమేంటి, అది సమాజానికి ఏ రకంగా పని కొస్తుంది" అని ప్రశ్నలు ఒచ్చేస్తాయి. ఈ పవిత్ర దాంపత్య వ్యవస్థ గురించీ, ఈ లైంగిక వ్యవస్థ గురించీ స్త్రీ వాదం చేస్తున్న విమర్శకు అతీతంగా ఈ కవితలను అర్థం చేసుకోవాలని ప్రయత్నించటమే అవివేకం.

'లేబర్ రూం' కవిత గురించి కూడా అభ్యంతరాలుండడం ఆశ్చర్యంగా వుంది. ఎంత కరుడు గట్టిన పురుషాహంకారులైనా పురుటినొప్పుల్లో స్త్రీ చావు బతుకుల పోరాటం సాగిస్తుందని అర్థం చేసుకుంటారని ఆశిస్తాం. పిల్లల్నికనటం ప్రకృతి ధర్మం, సామాజిక బాధ్యత వాటిని నిరాకరించడమేమిటని అహంకారంతో ప్రశ్నిస్తుంటే ఆ కవిత వాళ్లకు అర్థం కాలేదనుకోవడం తప్ప ఏం చెయ్యగలం? నిజమే - సామాజిక బాధ్యత అనే ఒప్పుకుందాం. ఐతే ఒక సామాజిక బాధ్యతను నిర్వహించాలనుకునే వాళ్ళు ఈ సమాజంలో ఎన్ని కష్టనష్టాలు భరించాల్సి వస్తోంది? ఎలా శిధిలమవ్వాల్సి వస్తోంది? ఆ కష్టాల్ని గురించి రాసే హక్కయినా వారికి లేదా ? వస్తువులను ఉత్పత్తి చేసే కార్మికుడు తన శ్రమ ఫలితం తనకు పరాయిదవుతుంటే బాధపడడా? సరుకుల ఆరాధన వల్ల తన శ్రమ దోపిడికి గురవుతుందని గ్రహించి దానికొక కవితా రూపం యిస్తే మెచ్చుకొనే వాళ్ళు - మాతృత్వమనే 'ఫెటిష్'లో తన శ్రమఫలం తనకు దక్కకుండా పోవడం గురించీ, తనెలా దోపిడికి గురవుతుందనే విషయం గురించీ రాస్తే ఎందుకు సహించలేక పోతున్నారు? 'పరాధీనత, బానిస కన్నీరు, ద్వీపాంతర వాసం' అన్న మాటల్లో ఆవేదన అర్థం కావడం లేదంటే పురుషాధిపత్య భావజాలంలో పూర్తిగా మునిగిపోయారన్నమాట.

"కాళ్ళులవలా ఎడంచేసి దీనంగా, హీనంగా, నీచాతి నీచంగా" (లేబర్ రూం) అన్న మాటలు మాతృత్వాన్నీ సామాజిక బాధ్యతనూ తిరస్కరిస్తున్నట్లు అనిపిస్తూంటే అది కరుడుగట్టిన పురుష దృక్పథం తప్ప 'లేబర్ రూం' గురించి వాళ్ళకేం తెలియదు. గర్భం ఎందుకొచ్చిందో తెలియని వాళ్ళూ, గర్భం రావడం యిష్టం లేని వాళ్ళూ, ఆ బాధ గురించి వెర్రి భయంతో ఒణికే వాళ్ళూ,

ఆ బల్ల మీదికి ఎక్కే వరకూ ఏం చెయ్యాలో, తమకేం జరుగుతుందో ఊహించలేని పిచ్చి తల్లులూ, తమని తిట్టి, కసిరి, మొరటుగా పరీక్షలు చేస్తున్న, ఎనిమాలిస్తున్న, షేవ్‌లు చేస్తున్న, కత్తులతో కోస్తున్న , వైద్య వ్యవస్థను చూసి అవమానంతో, సిగ్గుతో బిక్కచచ్చిపోయే అమాయకపు అమ్మలూ – వీళ్ళకు లేబర్ రూం ఒక నరకం. మాతృత్వం బాధాకరం.

మాతృత్వాన్ని నిజంగా ప్రకృతి ప్రసాదించిన వరంలాగో, అద్భుతమైన స్వభావం లాగో చూడాలనుకుంటే అది స్త్రీలకు పునరుత్పత్తి స్వేచ్ఛ వున్నప్పుడే జరుగుతుంది. స్త్రీల పునరుత్పత్తి అవసరాలకు అనుగుణంగా సమాజం మారినప్పుడే జరగుతుంది. స్త్రీలు తమ శరీరాలను, శరీర ధర్మాలను ప్రేమించుకో గలిగి, తాము కావాలనుకున్నప్పుడు, స్నేహ పూరితమైన వాతావరణంలో, అదొక మంచి అనుభవంలా, సృష్టి కార్యాన్ని మార్చగలిగినప్పుడే జరుగుతుంది. ఒక పక్క ఆడవాళ్ళ ఋతు ధర్మాలను అపవిత్రతలంటూ, అసహ్యించుకుంటూ, వాళ్ళపొట్టలను హేళన చేస్తూ, పురిటి గదులను నరక కూపాలుగా చేస్తూ, పురిటి కంపు అంటూ ముక్కులు మూసుకుంటూ, స్త్రీలను మాతృమూర్తులుగా మారమంటే అది జరిగే పని కాదు. పిల్లల్ని కనటం, మాతృత్వం ఒకటి కాదని స్త్రీలు తెలుసుకుంటున్నారు. ఈ రెండూ వేరు వేరు విషయాలని అర్థం చేసుకున్న స్త్రీలు, పిల్లల్ని కనటం మీ సామాజిక బాధ్యత అనటానికి సాహసించే వారికి వారి సామాజిక బాధ్యతల్ని గుర్తు చేస్తారు. పిల్లల్ని కనాలా ఒద్దా అని ఎంచుకునే హక్కు స్త్రీకి ఉందనీ, అది మానవహక్కుల్లో ఒకటనీ చెబుతారు. ఆ హక్కు కోసం స్త్రీలు ఉద్యమిస్తున్న రోజుల్లో 'లేబర్‌రూం' వంటి కవితపై కువిమర్శ చేయడం దుస్సాహసమని చెబుతారు. కడుపులో బిడ్డను కనాలనే తపనకూ, అలా కనిపెంచడం మహత్తరమైన పని అని మీరు విధించిన మాయాజాలానికీ లోనై బిడ్డను కనాలనుకుంటూ, అంతలోనే తనకున్న పరిమితులు, శారీరక యిబ్బందులూ, ఆర్థిక యిబ్బందులూ, సమాజంలో జరుగుతున్న కుటుంబ నియంత్రణ ప్రచారం, పురుషాధిపత్య సమాజం తన అవసరాలకనుగుణంగా అభివృద్ధి చేస్తున్న సైన్సు- వీటన్నిటి వల్లా అబార్షన్‌కు సిద్ధమవ్వాల్సిన స్థితికి వచ్చి ఒక స్త్రీ బావురుమంటుంటే మీకది వైయక్తిక సమస్యగా, పెడధోరణిగా కనపడిందా? అలాగే కనపడుతుంటే చరిత్ర మిమ్మల్ని క్షమించదు. పూర్వం బానిసల తిరుగుబాటు, కార్మిక వర్గ తిరుగుబాట్లు, ఆఖరికి

కమ్యూనిస్టు మానిఫెస్టో కూడా పాలక వర్గాలకు విశృంఖలంగా, పెడధోరణిగా అవినీతికరంగా కనపడ్డాయి. వాళ్ళనెవరూ రక్షించలేకపోయారు.

స్త్రీలకు సంబంధించిన విషయాలలో ఒక చిత్రమైన పరిస్థితి ఏర్పడింది. భౌతిక జీవితంలో వచ్చిన మార్పులను స్వీకరించి ఆచరిస్తున్న వారు కూడా భావ జాలంలో మార్పుని ఒప్పుకోలేక పోతున్నారు. మారుతున్న భౌతిక సమాజంతోపాటు, ఆ వేగానికి తగినట్టు భావజాలంలో మార్పులు రావడాన్ని అంగీకరించలేకపోతున్నారు. ఇవాళ తమ పిల్లలు ఓణీలు వేసుకోకపోతే, మిడీదార్లూ, షర్టులూ వేసుకుంటే ఈ విమర్శకులు బాధపడతారనుకోను. (బాధపడినా ఆ పిల్లలు లెక్క చెయ్యరు. అది వేరే విషయం) కానీ పై టను గురించిన భావజాలాన్ని మాత్రం వీళ్ళు ఒదలలేరు. దానిని ఒదిలేసిన వారిని చూసి భయపడతారు. అంటే భౌతిక వాస్తవికతను ఒదిలి పితృస్వామ్య భావజాలం విధించిన నైతిక ధర్మాలనే పట్టుకు వేళ్ళాడతారు.

ఆసుపత్రిలో 'లేబర్ రూం'ని చూసి ఈ విమర్శకులు ఉప్పొంగి పోతారనుకోను. సామాజిక బాధ్యత నిర్వర్తిస్తున్నారని తన్మయత్వం చెంది తమ భార్యా, పిల్లల అరుపుల్ని ఆనందపడుతూ వింటారనుకోను. అక్కడ లేని సౌకర్యాల గురించి ఆందోళన పడకుండాను వుండరు. వైద్య విధానాన్ని దుమ్మెత్తి పొయ్యకుండాను వుండరు. 'లేబర్ రూం' కవితలో నిర్మల చెప్పిన దానిలో పావువంతైనా ఫీలవుతారు. కానీ కొన్నాళ్ళకి ఆ భౌతిక వాస్తవికతను మర్చిపోయి ఆడవాళ్ళు పిల్లల్ని కనకపోతే ఎలా? మాతృత్వం ఎంత పవిత్రం అంటూ భావజాలపు మత్తులో పడిపోతారు. ఆ భావజాలం మత్తుని త్వరగా వదిలించుకుని స్త్రీలు రాస్తున్న భౌతిక వాస్తవికతను అర్థం చేసుకోండి. అవి వాళ్ళ స్వంత సమస్యలు కావనీ మొత్తం సామాజిక సమస్యలనీ గుర్తించండి.

స్త్రీవాద సాహిత్యం మీద నిర్మాణాత్మకమైన విమర్శ, స్త్రీ వాద దృక్పథంతో కూడిన విమర్శ యింకా రాలేదు. చేకూరి రామారావు గారే శిల్పాన్నీ, భాషనీ చెబుతూ కొంత ఈ కవితలను గురించి చెప్పారు. నిజానికి ఈ కవితల పట్ల సమాజంలో వ్యతిరేకత కంటే ఆసక్తే ఎక్కువగా వుంది. సాహిత్యాభిమానులు, వీటిని యిష్టపడుతున్నారు. ఎంతటి ఆర్తితో సహజంగా, అప్రయత్నంగా,

అనివార్యంగా ఈ కవితలను స్త్రీలు రాస్తున్నారో అర్థం చేసుకుంటున్నారు. ఈ నాటి సామాజిక అవసరంగా స్త్రీవాద కవితల్ని గుర్తిస్తున్నారు. ఒక నిర్మాణాత్మకమైన, సిద్ధాంత పునాది గల విమర్శ చెయ్యలేక తిట్లకూ వ్యక్తిగత నిందలకూ దిగేవారూ, విమర్శలో సైతం ప్రజలకర్థం కాని ఫ్యూడల్ పదబంధాలను ఒదలలేని వాళ్ళూ, సామాజిక ప్రయోజనం గల సాహిత్యానికి మార్గదర్శకులుగా మాట్లాడటం ఈ నాటి తెలుగు సాహిత్య విమర్శ ఎంత దుస్థితిలో వుందో తెలియజేస్తోంది. ఈ ధోరణిని తమ విశ్లేషణాపద్ధతిలో ఎదుర్కోవడానికి స్త్రీవాదులు సిద్ధమవ్వాలి. ఈ రకం విమర్శలు కాక స్త్రీ వాద రచయిత్రులు ఎదుర్కొనే మరొక ప్రమాదరకర ధోరణి వుంది. అది కనపడని ప్రమాదం. స్త్రీవాద రచయిత్రుల్లో ఎవరు ముందు, ఎవరు వెనుక, ఎవరు గొప్ప, ఎవరు మహా కవయిత్రులు అనే వివాదాలకు రచయిత్రులు ఎంత దూరంగా వుంటే అంత మంచిది. పురుష సమాజం సృష్టించిన ఈ రకమైన హైరార్కీల చట్రంలోకి, పోటీ ధోరణిలోకి వెళ్ళడం అనవసరం. ఆ చట్రంలో పడితే మనం ఎవరికి వాళ్ళం ఔతాం. మనవాళ్ళ నుంచి మనల్ని దూరం చెయ్యటానికి, ఎలియనేషన్‌కి గురి చెయ్యటానికి జరిగే ప్రయత్నమిది. మహాకవులూ, కవిత్రయాలూ, పీఠాధిపత్యాలు ఈ రకమైన సంస్కృతిలోకి మనం వెళ్ళకుండా వుంటే మంచిది. సమాజంలో మనకు నిత్యం జరిగే సంఘర్షణలకు మనం సాహిత్య రూపాలను సృష్టిస్తున్నాం. ఆ సాహిత్యం మన సంఘర్షణను పది మందికి తెలియజేసి పోరాడే ధైర్యాన్ని యివ్వగలిగేంత బలమైనదిగా వుండాలని మనం కృషి చేద్దాం. అదే మనం సృష్టించే సాహిత్య ప్రయోజనం.

స్త్రీల అణచివేతనూ, దాని స్వభావాన్నీ విశ్లేషించే పద్ధతీ, ఆ అణచివేతను వ్యతిరేకించే వుద్యమం, ఆ ఉద్యమపు వ్యూహం గురించిన వివేచన – ఇవీ యివాళ్టి చారిత్రక అవసరాలు ! అంతేకాని ఉత్తి గాలి కబుర్లు ఉక్రోషపు అరుపులు, వ్యక్తిగత నిందారోపణలూ కావు.

– ఓల్గా

సెప్టెంబర్ 92